"బ్రతుకు బుగ్గి చేసిన సారా" కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ

# మహిళాయజ్ఞం

పక్కి చక్రవర్తి



అది మూడు లాంతర్ల జంక్షన్. వాయవ్య దిశలో ఒకే ఒక కిళ్ళీబడ్డీ. పేరుకు కిళ్ళీబడ్డీ, కాని అది మినీ సూపర్ బజార్. చాక్‌లెట్స్ దగ్గర్నుండి చాయ్ పొడి వరకు అన్ని రకాల ఫేన్సీ గూడ్సు సరసమైన ధరకు లభిస్తాయి. (మాదక ద్రవ్యాలు కూడా లభిస్తాయి). కిళ్ళీబడ్డీలో కూచున్న అప్పల్నాయుడు అష్టావధానం చేస్తున్న అపర పండితుల్లా కనిపిస్తాడు. డేగ కళ్ళతో అందర్నీ పరిశీలిస్తూ అతిరథుడిలా మరోసారి కనిపిస్తాడు. పదిగంటల వరకు చాలా బిజీ. ఆ తర్వాత కాస్త విశ్రాంతి.

ప్రతీ యేడు కార్తీకమాసంలో అయ్యప్ప మాల వేసుకుంటాడు. కాని మూడువందల అరవై అయిదురోజులూ అయ్యప్ప గెటప్‌లో కనిపిస్తాడు. నుదిటిపైన తెల్లని విభూతి రేఖలు. దానిమీద అర్ధరూపాయంత చందనం బొట్టు. దానిమీద చిన్న పావలా అంత కుంకుమ బొట్టుతో నిత్యం అవతరిస్తాడు. అందుకే కిళ్ళీ బడ్డీకి "అయ్యప్ప పాన్ షాప్" అని బోర్డు వ్రాయించాడు. ఎప్పుడూ నోట్లో జర్దా కిళ్ళీ ఉండవలసిందే! అదీ బరంపురం జర్దా. కమ్మని వాసనతో ఉంటుంది. నాణెంకు రెండో వైపున బొరుసులా అప్పల్నాయుడు రాత్రి 9.00 గంటల తర్వాత కొట్టు కట్టేసింతర్వాత పూర్తిగా దేవదాసుకు దోస్త్ అయిపోతాడు. కాటవీధిలోని బ్రాందీషాప్‌లో తిష్టవేస్తాడు. పూర్తిగా తాగేసి కూడా నెమ్మదిగా యింటికి తలవంచుకునే వస్తాడు. దారిలో ఎవ్వరితో మాట్లాడడు. ఈ విషయం సామాన్య ప్రజలకు తెలియనివ్వడు. మందుకు బానిసగాని మానిని గౌరవిస్తాడు. పూజిస్తాడు. అందుకనే అప్పల్నాయుడంటే బొందిలగూడెం మహిళలంతా గౌరవిస్తారు.

కాలచక్రం ఎప్పుడూ తిరుగుతునే ఉంటుంది. కుటుంబం కొంచెం పెరిగింది. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లే ఇంటికి పెద్ద దిక్కు. అప్పల్నాయుడుకి వరుసగా ముగ్గురాడ పిల్లలు. ఆ తర్వాత ఒక మగనలుసు. ఇంట్లో ఒక మేనత్త కూడా ఉంది. ఆమె బాల వితంతువు. బాగా ఆస్తిపరురాలు. ఆమె వలన అప్పల్నాయుడికి కూడా ఆస్తి కలిసి వచ్చింది. ఒక మేడ కట్టియిచ్చింది. నాలుగు గేదెలు కొన్నది. అప్పల్నాయుడు భార్య నిర్మల నిజంగా నిర్మలమయిన ఇల్లాలు. ఇంటి దగ్గరే పాల వ్యాపారం గుట్టుగా చేస్తూ వేన్నీళ్లకు చన్నీళ్లలా సాయం చేస్తుంటుంది. మేనత్తది వడ్డీ వ్యాపా

రం. ముక్కు ముఖం తెలిసినవాళ్ళకే తక్కువ రేటుతో నగలు తాకట్టు పెట్టుకుని అప్పులి స్తుంది. ఆమె సంపాదన కూడా అప్పల్నాయుడి పిల్లలకే. ఇదండీ అప్పల్నాయుడి సంసార సాగరం.

కుటుంబ భారం పెరిగేసరికి అప్పల్నా యుడు త్రాగుడు బ్రాందీషాప్ నుండి కల్లు సారాకు చేరుకుంది. చక్రభ్రమణంలో మరి కొన్నేళ్లు తిరిగేసరికి అప్పల్నాయుడి ఆరోగ్యం బాగా దెబ్బ తింది. రాత్రి పూట విపరీతంగా దగ్గుతుంటాడు. సారా విపరీతంగా త్రాగడం వలన లివర్ చెడిపోయింది లాగుంది. పూర్వం రోజుల్లో అప్పల్నాయుడు కొట్టు కట్టేసి మూడు లాంతర్ల దగ్గరనుండి నడచుకుంటూ మసీదుకు ఎదురుగా ఉన్న సందుగుండా కోట్లమాదప్ప గారి వీధి గుండా తిన్నగా గౌడు వీధి జంక్షన్‌కు వచ్చి అక్కడ నుండి సుంకరవీధి గుండాగాని కాటవీధిగుండా గాని బొందిలగూడెం నడిచి పోయేవాడు. అదొక్కటే అతనికున్న వ్యాయా మం. రానురాను వయసు పెరగటంతో బలం తగ్గి, ఓపిక నశించి ఒక రిక్షా స్వంతానికి పెట్టు కున్నాడు. ఆ రిక్షా సింహాచలంగాడు కూడా అప్పల్నాయుడుతో కలిసి సారా తాగేస్తాడు. వారి స్నేహం కూడా పటిష్టమైన గోడలా గట్టి పడింది.

రోజులన్నీ ఒకేలాగుండవుకదా! ఒకరోజు అర్థరాత్రి దాటాక పీకలదాకా సారా తాగేసి కాట వీధి అప్ గుండా రిక్షా లాగుతూంటే ఒక క్వారీ లారీ వాడు వీళ్ళ రిక్షాని గుద్దేసి పరారైపోయాడు. అర్థరాత్రి రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. పెద్ద ఏక్సిడెంట్ జరిగి నట్లు ఎవ్వరికీ తెలియదు. రిక్షా నుజ్జు నుజ్జు అయిపోయింది. అప్పల్నాయుడు, సింహాచలం ఇద్దరి ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. ఆ రాత్రంతా ఆ రోడ్డు వారనే ఆ శవాలు దిక్కు మాలినట్లు పడి ఉన్నవి. తెల్లవారుఝామున కాటవీధి మనుష్యులు కాలకృత్యాలు తీర్చు కునేందుకు బహిర్భూమికి వెళ్లినవారు ఈ ఘాతుకాన్ని చూసారు. గుర్తుపట్టలేనట్లున్న శవాలు చూసి "అయ్యో! ఎవరీ అభాగ్యు లను"కున్నారు. బాగా తెల్లవారేకా గుర్తు పట్టారు. జరగవలసింది జరిగిపోయింది. అప్ప ల్నాయుడి కుటుంబానికి పెద్ద లోటు లేదు గాని సింహాచలం కుటుంబం దిక్కు లేనిదైపోయింది.

బ్రతుకు బుగ్గిపాలు చేసిన సారా ఎందరి జీవితాలు నాశనమైపోతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఒకప్పుడు సారా నిషేధించారు. మహిళలంతా నడుం బిగించి ఉద్యమించి సాధించిన సారా నీరుగారి పోయింది. మళ్ళీ ఉద్యమించాలి. చట్టం తీసు కురావాలి. దానికోసం మరలా మహిళలంతా ముక్త కంఠంతో ఉద్యమించి దాన్ని అమలు పరిచేదాక నిద్రపోకూడదు. సారాను మన సారా... నిషేధించండి!! మరొక్కసారి శంఖా రావం పూరించండి.. మహిళాశక్తి.... ఆది శక్తి... మీ శక్తి మాకు తెలుసు!! మీరంతా ముందుండండి. మేమంతా మీ వెనుక ఉంటాం. ముందుగా సారాను సంపూర్ణంగా నిషేధించాలి. ఆ పైన రైతుల ఆత్మహత్యల మాదిరి యిటువంటి దయనీయ బలహీన వర్గాల వారికి నూతన ప్రభుత్వం ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయాలి. ఈ రెండు వరాలు... ప్రభుత్వం కురిపించాలి. దానికోసం మహిళలంతా యజ్ఞం చేయాలి. వరాలు పొందాలి. అంతవరకు నిష్కృతి లేదు. సారా శంఖారావం పూరించండి. మహిళలూ ఉద్యమించండి. ❀

ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వర లోనే అందజేయబడుతుంది.

\- ఎడిటర్

## సింగిల్ పేజీ కథలకు ఆహ్వానం

'ప్రియదత్త' సకుటుంబ సచిత్ర వార పత్రికలో సింగిల్ పేజీ కథలు ప్రచురణార్థం రచయిత(త్రు)లకు ఆహ్వానం పలుకు తున్నాం. సింగిల్ పేజీ కథలు పంపేవారు ఈ క్రింది సూచనలు గమనింప కోరతాము.

★ కథ అర తావు సైజులో 3 పేజీలు మించరాదు.

★ పేజీకి ఒక వైపు మాత్రమే రాయాలి.

★ కథ తమ స్వీయ రచన అని, అముద్రితమని, హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి.

★ కథ చివరిభాగంలో, చిరునామాను వ్రాయాలి.

★ కథలను త్రిప్పి పంపగోరువారు తగి నన్ని స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచాలి. - ఎడిటర్


గ్యాస్ ట్రబుల్
మలబద్ధకము
అజీర్ణము తో
బాధ పడుతున్నారా?
క్యాప్‌జైమ్
చూర్ణమ్ ను వాడండి




తయారుచేయువారు :
చంద్రిక ఆయుర్వేదిక్ ఫార్మసీ
విజయవాడ-9
మార్కెట్ చేయువారు :
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.,
పార్కు రోడ్, విజయవాడ-1
ఫోన్ : 2424133